క్లుప్తంగా

ఈవీఎంలు సిద్ధం



పొన్నూరు : ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా నియోజకవర్గంలో 264 బూత్‌లలో ఓటింగ్ ప్రక్రియలో వినియోగించనున్న ఈవీఎంలు, వీవీప్యాట్లు సిద్ధమవుతున్నాయి. పట్టణంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో రిటర్నింగ్ అధికారి ఎ. లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో నిపుణుల పర్యవేక్షణలో ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ అమరిక, వరుస క్రమంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గుర్తులను ఏర్పాటులో తలమునకలై ఉన్నారు. ఎన్నికల బరిలో ఉన్న 14 మంది అభ్యర్థుల పర్య వేక్షణలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు ఆయా మండలాల ఏఆర్వోలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పనిచేస్తున్నారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి ఫార్మశీ విద్యార్థుల ప్రతిభ




గుంటూరు రూరల్: లాం కళాశాలలో హైదరాబాదుకు చెందిన గ్లాండ్ ఫార్మా సంస్థ శనివారం ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. ఇందులో తమ కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చలపతి ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులుతో పాటు శాంతికిరణ్, శ్రీమన్నారాయణ, రాజేంద్ర, వంశీకృష్ణరాజు తదితరులు అభినందించారు.

దేవదాయశాఖ బోర్డులు ధ్వంసం



ప్రత్తిపాడు: దేవాదాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను కొందరు గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. దీనిపై రామస్వామి ట్రస్టు ఈవో జె.వి. నారాయణ పోలీసులకు పిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో వివాదంలో ఉన్న మదమంచి రామస్వామి ట్రస్టును కొద్ది నెలల కిందట దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ట్రస్టుకు ఈవోను కూడా నియమించారు. ఈ నేపథ్యంలో స్థలంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ బోర్డులను ఏర్పాటు చేసింది. కాగా ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నేల మట్టానికి కోసేసి వాటిని తొలగించారు. ఈ విషయమై శనివారం ట్రస్టు ఈవో జె.వి. నారాయణ పోలీసులకు పిర్యాదు చేశారు.

నవ్వుతో వ్యాధులు దూరం



గుంటూరు మెడికల్: ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపేటలోని ఎస్‌వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో లాఫ్టర్ యోగ ప్రదర్శన, షుగర్ వ్యాధి చికిత్సలో నవ్వుల పాత్ర అంశంపై సదస్సు శనివారం నిర్వహించారు. సదస్సులో లాఫ్టర్ యోగ లీడర్ డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ నవ్వడం వలన మంచి ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. ఎక్కువ మంది నేడు ఒత్తిడితో బాధపడుతున్నారని చెప్పారు. దీని వలన బీపీ, షుగర్, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. హాయిగా నవ్వడం ద్వారా శరీరంలో ఎండార్ఫిన్ విడుదలై ఆందోళన, డిప్రెషన్ తగ్గుతోందన్నారు. గుంటూరులో డాక్టర్స్ స్మైల్ క్లబ్ ద్వారా డాక్టర్ కమల ఆధ్వర్యంలో లాఫ్టర్ యోగ తరగతులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రామ్‌కుమార్ వెల్లడించారు.

పొన్నూరును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- గుండవరం, గొడవర్రు గ్రామాల్లో ఘన స్వాగతం
- టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల ఇంటికే పరిమితమయ్యారని ఎద్దేవా



భారీ ర్యాలీలో భాగంగా అంబటి వెంట గ్రామస్తులు

చేబ్రోలు : పొన్నూరును రాష్ట్రానికే ఆదర్శవంతమైన నియోజకవర్గంను తీర్చిదిద్దుతానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేబ్రోలు మండలం గొడవర్రు, గుండవరం గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా చోట్ల మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. రెండు గ్రామాల పరిధిలో ఎన్నికల ప్రచార రథంపై నుంచి ఆయన ప్రజలకు అభివాదం చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్థానిక నాయకులతో కలిసి రెండు గ్రామాల పరిధిలో అంబటి మురళీకృష్ణ ముమ్మరంగా ప్రచారం నిర్వహించగా, ప్రజల నుంచి అనూహ్య స్పందన లబించింది. అడుగడుగునా ప్రచారాన్ని స్వాగతిస్తూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ తన నామినేషన్ కార్యక్రమానికి క్వారీ తిరునాళ్లను తలపించే విధంగా ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. పెదకాకాని మండలం నంబూరు నుంచి పొన్నూరు వరకు భారీ ర్యాలీ జరిగిన తీరు చూడముచ్చటేసిందన్నారు. ఆ రోజు నుంచే ధూళిపాళ్ల నరేంద్రకు ఓటమి భయం పట్టుకుందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అందుకే ప్రజల్లోకి ప్రచారానికి రాకుండా ఇంటికే పరిమితమయ్యారని విమర్శించారు.

నరేంద్ర జైలుకెళ్లడం ఖాయం

16 క్రిమినల్ కేసులు, స్కామ్ లలో ప్రమేయం ఉన్న నరేంద్ర జైలుకు వెళ్లటం ఖాయమని అంబటి అన్నారు. ఆలీబాబా 40 దొంగల్లా ఏదో రోజు నియోజకవర్గాన్ని వదిలి పారిపోవచ్చునన్నారు. సంగం డెయిరీని అడ్డుపెట్టుకొని కోట్ల రూపాయిలు దోచుకున్న ఘనుడు ధూళిపాళ్ళ అని ఆరోపించారు. గ్రామదేవత సాక్షిగా నీతిమంతమైన పాలన సాగిస్తానని అంబటి ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు విజయం చేకూర్చాలని గ్రామస్తులను అభ్యర్థించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొర్రు రామారావు, తోట వీరభద్రయ్య, ఆరాధ్యుల శ్రీనివాసరావు, బత్తుల వెంకటేష్, షేక్ కరీముల్లా, హుస్సేన్, డి అక్కిరెడ్డి, కొమ్ము రాంబాబు, కాకాని రమేష్, గుండవరం గ్రామానికి చెందిన పార్టీ నాయకులు చుక్కా నాగబాబు, గుంటూరు శ్రావణి, శివన్నారాయణ, తుపాకుల శివయ్య, మక్కె నాగబాబు, వెంకటేష్, చుక్కా రాజబాబు, శేఖర్‌బాబు, తుపాకుల రామయ్య, బాష్యం చెంచుబాబు తదితరులు పాల్గొన్నారు.

ధూళిపాళ్లవి చౌకబారు రాజకీయాలు

వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ధూళిపాళ్ల నరేంద్రవి చౌకబారు రాజకీయాలని పొన్నూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ విమర్శించారు. హెలీప్యాడ్ ధ్వంసం ఘటనకు సంబంధించిన ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు. ఆ పార్టీ నేతలు పనిగట్టుకొని అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎవరో కాంట్రాక్టర్ నిర్మించిన హెలీప్యాడ్‌ను అతి తక్కువ ధరకు దక్కించుకుని పర్మిషన్ పొందాలని ధూళిపాళ్ల ప్రయత్నించారన్నారు. ఆ పథకం ఫలించకపోవడంతో కుటిల రాజకీయాలకు తెర తీశాడని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్ అనుమతి దొడ్డిదారిన పొందాలని చూడటం సిగ్గు చేటన్నారు. పట్టణంలోని సజ్జ కళ్యాణ మండపం స్థలంలో టీడీపీ అభ్యర్థి ఎలాంటి హెలిప్యాడ్‌ను నిర్మించలేదని, ఎవరూ ధ్వంసం చేయలేదన్నారు. సంబంధిత కాంట్రాక్టరు నిర్మించిన హెలీప్యాడ్ స్థల యజమానితో చేసుకున్న ఒప్పందం పూర్తయిన క్రమంలో మెటీరియల్ తాను తీసుకుపోయాడని తెలిసిందన్నారు. సంబంధిత కాంట్రాక్టరుతో నరేంద్రకు బేరం కుదరనందునే ఈ సంఘటన జరిగిందన్నారు. ఈ సంఘటనకు తనకు ఎలాంటి సంబంధం లేదని ధూళిపాళ్ల దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంట్రాక్టరు, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మధ్య రేటు విషయంలో జరిగిన అభిప్రాయ భేదమే కారణమై ఉండొచ్చన్నారు. కాంట్రాక్టర్ అడిగిన మొత్తాన్ని ఇవ్వడానికి అంగీకరించకుండా ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ నిరాకరించినట్లు తెలిసిందన్నారు.కూటమిలోని కీలకమైన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పర్యటన కోసం ఒక హెలిప్యాడ్ ను నిర్మించకుండా, ఇలా ఎదుటి వారిని నిందిస్తారా? అని మండిపడ్డారు. ఇలాంటి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని అంబటి మురళీకృష్ణ హితవు పలికారు.

ఫ్యాన్ గురుకు ఓటేద్దాం

ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతుగా జోరుగా ప్రచారం



ప్రత్తిపాడులోని వైఎస్సార్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

ప్రత్తిపాడు: బలసాని కిరణ్ కుమార్ కే పట్టం కడదాం..ఫ్యాన్ గుర్తుకే ఓటేద్దామంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలను కోరుతున్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌కు మద్దతుగా నియోజకవర్గ కేంద్రంలో డాక్టర్ వైఎస్ఆర్ కాలనీలో శనివారం రాత్రి పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. గడపగడపకూ వెళ్లి కరపత్రాలు అందజేశారు. మరో తొమ్మిది రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రెండుఓట్లూ ఫ్యాన్ గుర్తుకే వెయ్యాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ వలంటీర్లు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.


ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య



హత్యకు గురైన ప్రేమ్‌కుమార్(ఫైల్)

పట్నంబజారు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలలలసి భర్తను హతమార్చిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. బుచ్చయ్యతోటలో నివాసం ఉండే కుక్కమూరి ప్రేమ్‌కుమార్(30) ఆర్టీసీ బస్టాండ్ వద్ద పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ప్రకాశం జిల్లాకు చెందిన ప్రేమ్‌కుమార్, అతడి భార్య భారతితో కలసి మూడేళ్ల క్రితం గుంటూరు వచ్చి బుచ్చయ్యతోటలో నివాసం ఉంటున్నారు. ఈనేపథ్యంలో భారతి లాలాపేట ప్రాంతానికి చెందిన గౌస్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. గుర్తించిన ప్రేమ్‌కుమార్ పలుమార్లు భారతిని వారించాడు. అయితే వివాహేతర సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని, అతడి హతమార్చేందుకు సిద్ధమయ్యారు. గతనెల 28వ తేదీన గౌస్, ప్రేమ్‌కుమార్‌ను మద్యం తాగుదామని చెప్పి తీసుకెళ్లి, వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు ఖాళీ స్థలంలో మరో ఇద్దరితో కలసి హతమార్చాడు. అయితే తన భర్తను హతమార్చాలని భారతి, గౌస్‌ను కోరడంతో పక్కా ప్లాన్ చేసుకుని హత్య చేశారు. అనంతరం 28వ తేదీ రాత్రి తన భర్త కనిపించడం లేదంటూ భారతి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు కాల్ డేటా ఆధారంగా భారతి, గౌస్‌తో పలు మార్లు ఫోన్ మాట్లాడడాన్ని గుర్తించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. అయితే భారతి, హత్యకు పాల్పడిన గౌస్ పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దాసరి నారాయణరావుకు ఘన నివాళి



దాసరి నారాయణ రావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి

లక్ష్మీపురం: సినీ దర్శకుడు డాక్టర్ దాసరి నారాయణరావు చిరస్మరణీయుడని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సినీ దర్శకులు కె.జయకుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం దాసరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 44 ఏళ్ల పాటు చిత్ర పరిశ్రమలో కొనసాగి ఎంతో మందికి సినీ జీవితాన్ని ప్రసాదించడంతో పాటు పరిశ్రమకు పెద్ద దిక్కుగా కొనసాగిన దాసరి జయంతిని డైరెక్టర్ డే గా తెలుగు చలన చిత్రం దర్శకులు సంఘం నిర్వహించడం అంటే ఆయనకు ఎంతటి గౌరవం ఉందో అర్థమవుతుందన్నారు. అనంతరం సంస్థ సభ్యులు సినీ రంగ విశ్లేషకులు ఎ.అమరాచారి, సంస్థ సాంస్కృతిక కార్యక్రమాల కో ఆర్డినేటర్ బిళ్లా అశోక్, గాయకులు సాయిబాబు, రాజశేఖర్ తదితరులు నివాళులర్పించారు. రాష్ట్రంలో పెన్షన్ దారులకు పెన్షన్‌ను బ్యాంకు ఖాతాలో వేస్తామని చెప్పి రకరకాల కారణాలతో చార్జీలు వసూలు చేయడం దారుణమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచంపై ఉన్న వారికి ఇంటి వద్దే పెన్షన్లు పంపిణీ చేస్తామని చెప్పి బ్యాంకుల్లో జమ చేసి నానా ఇబ్బందులకు గరి చేయడం అన్యాయమని అన్నారు. పెన్షన్ దారుల వద్ద ఎటువంటి చార్జీలను వసూలు చేయరాదని, ఇప్పటి వరకూ వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి ఇచ్చివేయాలని డిమాండ్ చేశారు.

నాన్నను ఎంపీగా, అన్నను సీఎంగా చేసుకుందాం

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య కుమార్తె కిలారి శ్రీసాయి నివ్య గోరంట్ల గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు జగనన్న ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలు వివరించారు. మరోసారి జగనన్న సీఎం ఐతేనే పేదలు, బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. 'మా నాన్నను ఎంపీగా గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం' అని పిలుపునిచ్చారు. ఈ నెల 13న ఫ్యాను గుర్తుకు ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

నిరుద్యోగ యువతకు ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కడపలో ట్యాలీ, కంప్యూటర్ నైపుణ్యంపై ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ శనివారం ఓప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 26 ఏళ్ల లోపు వయసు ఉన్న అభ్యర్థులకు కడపలో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15 వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని కోరారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి ఫార్మశీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: లాం కళాశాలలో హైదరాబాదుకు చెందిన గ్లాండ్ ఫార్మా సంస్థ శనివారం ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. ఇందులో తమ కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చలపతి ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులుతో పాటు శాంతికిరణ్, శ్రీమన్నారాయణ, రాజేంద్ర, వంశీకృష్ణరాజు తదితరులు అభినందించారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కుల పంపిణీ

నగరంపాలెం: పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని ఏఎస్పీ జీవీ రమణమూర్తి శనివారం అంజదేశారు. అనారోగ్య కారణాలతో ఇటీవల ఎస్ఐ డి.ప్రసాద్‌రావు(ఏఆర్), ఏఎస్ఐ కె.శివశంకరరావు(పెదకాకాని పీఎస్), హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ–డీసీఆర్‌బీ) సీహెచ్ శ్రీనివాసరావు మృతి చెందారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ప్రసాద్‌రావు భార్య రమ్యకృష్ణకు లక్ష రూపాయల చేయూత, వీడియో ఫండ్ రూ.50 వేలు, ఫ్లాగ్‌ఫండ్ రూ.25 వేలు, శివశంకర్‌రావు కుమార్తె జ్యోతికి లక్ష రూపాయల చెక్కు, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల చెక్కును డీపీఓలో జిల్లా ఏఎస్పీ (పరిపాల న) జీవీ.రమణమూర్తి అందించారు. డీపీఓ ఏఓ వెంకటేశ్వరావు, పి.సెక్షన్ సూపరింటెండెంట్ రమాదేవి, పోలీస్ అసోసియేషన్ సభ్యులు హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు మహంకాళేశ్వరి ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరు గ్రామంలోని మహంకాళేశ్వరి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం వేదపండితులతో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అఖండ మండపారాధన పూజలు చేస్తారని చెప్పారు. అనంతరం కాళీమాతకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేస్తారన్నారు. చండీహోమం, కోటి కుంకుమార్చనలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జగనన్న మాట శిలా శాసనం

- హామీ ఇస్తే అమలు చేస్తాడంతే..
- ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్
- నగరాలులో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో టిఫిన్ బండి వద్ద అట్టువేస్తున్న బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: జగనన్న హామీ ఓ శిలాశాసనం లాంటిదని, మాట ఇస్తే అమలుచేసి తీరతాడని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం 46వ డివిజన్ నగరాలులో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికులు ఎమ్మెల్యే అభ్యర్థి బలసానికి సాదర స్వాగతం పలికారు. అనంతరం గడపగడపకు తిరుగుతూ ప్రజలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేకూరిన ప్రయోజనంపై అడిగి తెలుసుకున్నారు. జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుంటే ప్రజాసంక్షేమం ఇప్పుడున్నదానికంటే రెట్టింపవుతుందన్నారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు.

బాబు నమ్మిస్తాడు...బాంబు వేస్తాడు

14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడైనా పేదల సంక్షేమం కోసం గుర్తుండిపోయే పథకాన్ని అమలు చేశారా? . ఇప్పుడు వైఎస్సార్ సీపీనే అధికారంలోకి వస్తుందని తెలిసి అమలు చేయలేని హామీలతో మేనిఫెస్టోను వెల్లడించి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని బలసాని వ్యాఖ్యానించారు. బాబు నమ్మించి బాంబు వేసే రకమని, ప్రజలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

2014లో 600 హామీలు ఇచ్చి ఏవిధంగా మోసం చేశాడో ఓ సారి గుర్తు చేసుకోవాలని ప్రజలను కోరారు. కుల,మత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను నేరుగా అందించిన ఘనత దేశంలో ఒక్క జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అగ్రవర్ణాల పేదలకూ సంక్షేమ పథకాలు ఇంటివద్దకే అందించారన్నారు. కానీ చంద్రబాబు పింఛన్ల విషయంలో విషం కక్కి, వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ఉసురు పోసుకుంటున్నారని దుయ్యబట్టారు. పింఛన్ల కోసం బ్యాంకులు, మీ సేవా కేంద్రాల్లో ఎండల్లో పడిగాపులు కాస్తూ పడరాని కష్టాలు పడుతున్నారన్నారు. పేదలను అణగదొక్కి పెద్దలను దోచిపెట్టడమే చంద్రబాబు లక్ష్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలుపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, డివిజన్ కన్వీనర్లు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల డైరక్టర్లు, మార్కెట్ యార్డుల డైరెక్టర్‌లు, సొసైటీల డైరెక్టర్లు, చైర్మన్‌లు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కోత కుట్టు లేకుండా పసరతిత్తి నాళంలో రాళ్లు తొలగింపు

- గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల ప్రతిభ
- అభినందించిన సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్



శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న ఆదెమ్మతో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ నాగూర్‌బాషా, వైద్యులు

గుంటూరు మెడికల్: కోత కుట్టు లేకుండా పసరతిత్తి నాళంలో రాళ్లు తొలగించి జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల బృందం ప్రతిభ చాటింది. వివరాలు.. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన ఆదెమ్మ పచ్చకామెర్లతో ఏప్రిల్ 17వ తేదీన గుంటూరు జీజీహెచ్‌లోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీకి వచ్చారు. రోగికి వివిధ పరీక్షలు చేసి వార్డులో చేర్పించారు. డాక్టర్ కవిత, డాక్టర్ నాగూర్‌బాషా పరీక్షించి పసరతిత్తి నాళంలో మూడు సెంటిమీటర్ల రాళ్లు ఉన్నాయని నిర్ధారించారు. ఈ రాళ్లను ఈ ఆర్‌సీపీ ద్వారా తీయాలని నిర్ణయించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ వెల్లడించారు. ఏప్రిల్ 24న మత్తు ఇచ్చి బలూన్ ద్వారా విజయవంతంగా రాళ్లను తీశారు. రోగి ఆరోగ్యంగా ఉండటంతో ఈ నెల 5న డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. రోగికి రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీద్వారా శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. రోగి ఆరోగ్యవంతంగా ఇంటికి పంపించిన వైద్యులను శనివారం అభినందించారు. చికిత్స చేసేందుకు డాక్టర్ శివరామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ కుమార్, పీజీ వైద్యులు, మత్తు వైద్యులు ఎం.పోలయ్య, విష్ణు మహేష్ పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్స్‌ట్రేటర్ అప్పగింత

గుంటూరు మెడికల్: ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా ఉన్న ఓ రోగి గుంటూరు జీజీహెచ్‌కు వచ్చింది. చికిత్స అనంతరం రోగికి అవసరమైన వైద్య పరికరం ఆక్సిజన్ కాన్స్‌ట్రేటర్‌ను రోగి ఇంటికి జీజీహెచ్ వైద్యులు పంపించారు. ఆరు నెలల అనంతరం రోగి కుదటపడడంతో ఆక్సిజన్ కాన్స్‌ట్రేటర్‌ను రోగి బంధువులు శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మహిళ తండ్రి చంద్ర శేఖర్ ఆక్సిజన్ కాన్స్‌ట్రేటర్ ను ఇంట్లో ఉంచుకోకుండా తిరిగి ఆసుపత్రికి ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ బత్తులవెంకట సతీష్ కుమార్, జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సింధూర పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీ కృష్ణార్జునయుద్ధం ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై శనివారం రాత్రి శ్రీకృష్ణార్జున యుద్ధం పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. ఈశ్వర వరప్రసాద పరిషత్ సౌజన్యంతో శ్రీలక్ష్మీ నరసింహ నాట్యమండలి ధర్మపురి ఆధ్వర్యంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు రచయితగా, డాక్టర్ సంగనభట్ల నరసయ్య దర్శకత్వం వహించారు. శ్రీకృష్ణుడిగా డాక్టర్ నరసయ్య, అర్జునుడిగా నరహరి శర్మ, గయుడు, సాచ్చకిగా బొజ్జ రాజగోపాల్‌శర్మ, నారదుడిగా సంగనభట్ల రామకష్టయ్య పాత్రధారులుగా వ్యవహరించారు. పుడమి గ్రూపు చైర్మన్ ముత్తవరపు సురేష్ మాట్లాడుతూ నాలుగు తరాలుగా ఒకే సంస్థ పౌరాణిక నాటకం ప్రదర్శించడం తెలుగు ప్రేక్షకుల అదృష్టమని అన్నారు. అనంతరం పాత్రధారులను, సాంకేతిక నిపుణులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల సినీ నటులు, దర్శకుడు వైఎస్ కృష్ణేశ్వరరావు, దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సాహిత్యవేత్త మోదుగుల రవికృష్ణ, సెట్లం చంద్రమోహన్ పలువురు పౌరాణిక నాటకాభిమానులు పాల్గొన్నారు.